విశాలాంధ్ర విశాఖపట్నం
శుక్రవారం 19, సెప్టెంబర్ 2025

ఆక్రమణ దుకాణాలు తొలగింపు

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస మెయిన్ రోడ్డుకు ఇరువైపులా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. అక్రమంగా నిర్వహిస్తున్న ఈ దుకాణాలు ప్రయాణికులకు, వాహనదారులకు ఎప్పటికప్పుడు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇది గమనించిన ప్రభుత్వ అధికారులు నిర్మాణాలను తొలగించారు. జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు, పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి రామకృష్ణ అధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు.

కూలేందుకు సిద్ధంగా నగరంపాలెం శ్మశాన ప్రహరీ

కూలకుండా రక్షించండి... జీవీఎంసీ, వీఎమ్మార్డీఏ కమిషనర్లకు సీపీఐ విజ్ఞప్తి

విశాలాంధ్ర - మధురవాడ: రోడ్డునిర్మాణం కోసం నగరం పాలెం శ్మశాన ప్రహరీని ఆనుకొని వున్న గ్రావెల్‌ను తవ్వటం వలన ఆ ప్రహరి కూలిపోయే ప్రమాదం వుందని, కనుక ఆ ప్రహరి కూలకుండా తగు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ, వీఎమ్మార్డీఏ కమిషనర్లకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు గురువారం విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధిలో నగరంపాలెం సచివాలయం నుండి వాంబే కాలనీ మీదుగా మిథిలాపురి ఉడా కాలనీ రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారన్నారు. ముందుగా మట్టిరోడ్డు తయారు చేస్తున్నారని, ఇది అందరికీ ఉపయోగకరమేనని, ఈ రోడ్డు వలన ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, కాని ఈ రోడ్డు నిర్మాణం కోసం పక్కనే ఉన్న నగరంపాలెం శ్మశానం ప్రహరీని ఆనుకుని జెసిబిలతో గ్రావెల్ తవ్వి ఆ రోడ్డు నిర్మాణ పనులకు వినియోగిస్తున్నా రన్నారు. దీనివలన ప్రహరీ కూలిపోయే ప్రమాదం ఉందని, రోడ్డు నిర్మాణం కోసం శ్మశానం ప్రహరీ కూలకుండా అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణపై జీవీఎంసీ కమిషనర్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వార్డులలో పారిశుద్ధ్య పనులను సరిగా నిర్వహించడం లేదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 5వ జోన్ 47వ వార్డులోని కప్పరాడ, తాటిచెట్లపాలెంలో ఉన్న అన్న క్యాంటీన్ తదితర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాలు రోడ్లు, కాలువలపై అస్తవ్యస్తంగా కనబడుతున్నాయని శానిటరీ ఇన్స్పెక్టర్ సత్యం, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. 260, 270 వార్డు సచివాలయం శానిటరీ కార్యదర్శులు నందకిషోర్, ఝాన్సీల మొబైల్ ఫోన్ ద్వారా ముఖ గుర్తింపు హాజరును పరిశీలించి, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం తాటిచెట్లపాలెంలో అన్నా క్యాంటీన్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని, జీవిఎంసీ 95వ వార్డు, పురుషోత్తపురం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మార్గనిర్దేశికత్వంలో హాస్పిటల్ ఇన్‌చార్జ్ డాక్టర్ దీపిక, ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ డాక్టర్ పద్మజ సిబ్బంది పాల్గొని స్థానికులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జనసేన సీనియర్ నాయకులు, పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్కి గోవింద్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళలకు ఎంతో ఉపయోగకారిగా ఉంటుందని తెలిపారు. దాదాపు 200మంది మహిళలు పాల్గొని హెల్త్ చెకప్ చేయించుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో పెందుర్తి తెలుగు యువత అధ్యక్షులు కోటిబని శ్రీను యాదవ్, చీర రాజు, మెండా సతీష్, ఉరిటి శ్రీను, కోరడా శ్రీను, నమ్మి అశోక్, బాదంపూడి కృష్ణ, సింగంపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాన్వెంట్ జంక్షన్ వద్ద మెరైన్ పార్క్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: 100 అడుగుల ఎత్తైన హై మాస్ట్ జాతీయ పతాకానికి శంకుస్థాపన చేసి, రూ.2.7 కోట్లు వ్యయంతో నిర్మించిన మెరైన్ పార్క్‌ను విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్ పర్సన్ డా. ఎం.అంగముత్తు గురువారం కాన్వెంట్ జంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్ట్, జిల్లా యంత్రాంగం సమన్వయంతో రహదారులు, నడక మార్గాలు, మధ్య విభజనల అభివృద్ధి, పచ్చదనాన్ని పెంపొందించడం, రాత్రివేళలలో పోర్టు ప్రాంతం అందంగా కనిపించేలా లైటింగ్ స్ట్రిప్స్ ఏర్పాటు వంటి పలు పనులను చేపడుతున్నట్టు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన మెరైన్ పార్క్‌లో యాంకర్, స్టార్ ఫిష్, డాల్ఫిన్స్, సముద్రపు గవ్వ వంటి సముద్ర సంబంధిత ప్రకాశించే శిల్పాలను, అందమైన మొక్కల మధ్య సుందరమైన మార్గం ఇరువైపులా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కాన్వెంట్ జంక్షన్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఎదురుగా 30 మీటర్ల (100 అడుగుల) ఎత్తైన హై మాస్ట్ జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన చేశారు. మూడు నెలలలో ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఈ కార్యక్ర మంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే, విభాగాధిపతులు, పోర్ట్ కార్యదర్శి టి.వేణు గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో సీపీ మాట్లాడుతూ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా రోడ్ ట్రాఫిక్ ఆక్సిడెంట్ విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్ విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆఫీస్ ప్రాంగణంలో గత ఏడాది డిసెంబర్ 8న ప్రారంభించడం జరిగిందని, గుర్తు తెలియని వాహనం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాల్లో (హిట్ రన్) బాధితులకు లేదా బాధిత కుటుంబీకులకు ప్రభుత్వం కల్పించే ఆర్థిక పరిహారం వారి అకౌంట్‌లలో జమ అయ్యేంతవరకు అవసరమైనటువంటి సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయలు, తీవ్ర గాయాల పాలైన వారికి 50 వేల రూపాయలు మంజూరు చేయడం జరుగుతుందని, అలాగే పోలీస్ స్టేషన్‌ల వద్ద నుండి ఎఫ్ఐఆర్ గాయాల సర్టిఫికెట్, పోస్టుమార్టం సర్టిఫికెట్, శవ పంచనామా మొదలగు డాక్యుమెంట్లను ఈ సహాయక కేంద్రం సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ద్వారా బాధితులకు అందించడం జరుగుతుందన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు 79 మంది కుటుంబ సభ్యులకు 63 లక్షల 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇన్సూరెన్స్ ద్వారా అందజేశామన్నారు. ఇందులో 16 మంది మృతి చెందగా 63 మంది గాయపడ్డారని తెలిపారు.

ఎమ్మెల్యే బొండాకు ఆటో డ్రైవర్ల ఫెడరేషన్ కృతజ్ఞతలు

విశాలాంధ్ర - విశాఖ: ఆటో డ్రైవర్లకు వేలాది రూపాయలు ఫైన్ విధించేందుకు సంబంధించిన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ రెహమాన్, జిల్లా కార్యదర్శి సిహెచ్.కాసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఇటీవల అనంతపురంలో జరిగిన బహిరంగ సభలో వాహన మిత్ర గురించి ప్రకటించారని తెలిపారు. ఈ నమోదు కార్యక్రమానికి గడువును డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. రవాణా శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో 7.30లక్షల ఆటోలు ఉన్నాయని తెలిపారు.

అదాని గంగవరం పోర్ట్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఆపాలి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పెదగంట్యాడ ఏరియా సర్వే నంబరు 97, 98, 99/101లో గంగవరం పోర్టు అదాని సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతున్నారని, పెదగంట్యాడ వార్డ్ జీవీఎంసీ కార్పొరేటర్లు అందరూ వ్యతిరేకించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక పరిశ్రమ రావడం వలన 300 మందికి ఉపాధి ఉండొచ్చు కానీ ప్రజలు అనారోగ్యం బారిన పడతారన్నారు. గర్భిణీలకు, చిన్న పిల్లలకు క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు. దుమ్మి ధూళి కాలుష్యం వల్ల అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంటుందని, కావున వచ్చేనెల అక్టోబర్ 8వ తేదీని పెదగంట్యాడ ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ప్రజా అభిప్రాయ సేకరణకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏరియా నాయకులు డి.వెంకట్రావు, నమ్మి రమణ, పాల్ శ్రీను, అప్పల రెడ్డి, కనితి అప్పలరాజు, వై.అప్పల్రాజు, శ్రీను, అప్పలరాజులు ఎం.ఆర్.ఓ అమలకు వినతి పత్రం ఇచ్చారు.

ఆటో బోల్తా: వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కుసులువాడ సమీపంలో ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన చోటుచేసుకుంది. చందక పంచాయతీ జగన్నాథపురం, నిమ్మలవారి కల్లాలకు చెందిన ఎర్ర గౌరీనాయుడు (39) కుసులవాడ నుండి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తీగలవాని చెరువు వద్ద ఎదురుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో ఆయన నడుపుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గౌరీనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య జయ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆనందపురం సిఐ వాసనాయుడు ఆధ్వర్యంలో ఎస్సై సంతోష్ దర్యాప్తు చేస్తున్నారు.

లాటరీ ద్వారా 11 బార్ల కేటాయింపు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జీవీఎంసీ పరిధిలో రెండవ దశ బార్ నోటిఫికేషన్‌కు గురువారం నగరంలో డ్రా జరిగింది. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ 11 బార్లకు డ్రా తీసి అర్హులను నిర్ణయించారు. 2025 - 2028 సంవత్సరాలకు గాను విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వం 121 బార్లకు ఓపెన్ క్యాటగిరిలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. వీటిలో గత నెల 30 న జరిగిన డ్రాలో 58 బార్లకు లైసెన్స్ జారీ చేశారు. మిగిలిన 63 బార్లకు రెండవ దశలో నోటిఫికేషన్ జారీ చేయగా 11 బార్లకు 44 అప్లికేషన్ వచ్చాయి. అభ్యర్థుల సమక్షంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ లాటరీ నిర్వహించి ఎంపికైన అభ్యర్థులను ప్రకటించారు. వారు ప్రభుత్వం నిర్ణయించిన రిటైల్ ఎక్సైజ్ టాక్స్ కట్టిన తర్వాత బార్లు ప్రారంభించుకోవచ్చని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్ర మూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు.

కూర్మన్నపాలెం డిపోను లీజు గడువును పొడిగించాలి

రూ.133 కోట్ల డిపాజిట్ మినహాయింపు కోసం కూటమి నాయకులు చొరవ చూపాలి
ఇ.యు రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య విజ్ఞప్తి

విశాలాంధ్ర - గాజువాక: విశాఖపట్నం కూర్మన్న పాలెం ఆర్టీసీ డిపో స్థలం స్టీల్ ప్లాంట్ పరిధిలో ఉండటంతో, యాజమాన్యం డిపోను ఖాళీ చేయమని నోటీసులు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో ఆగస్టు 10 న గాజువాక ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ద్వారా లీజు గడువును మరో 33 సంవత్సరాలు పొడిగించేలా చర్యలు తీసుకోవాలని ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ప్రస్తుత లీజు కొనసాగించాలంటే రూ.133 కోట్లు డిపాజిట్ చేయాలని స్టీల్ ప్లాంట్ యాజమాన్యం డిమాండ్ చేస్తుండగా, ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిపాజిట్‌కు మినహాయింపు ఇవ్వాలని యూనియన్ నేతలు కోరారు. గురువారం విశాఖపట్నం జిల్లా నిర్మాణ సభ కూర్మన్నపాలెం వద్ద జిల్లా అధ్యక్షులు కె.యస్.యస్.మూర్తి అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధర్యంలో జరిగింది. ఇ.యు రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వీ.నర సయ్య మాట్లాడుతూ విశాఖ నగర రవాణాలో కూర్మన్నపాలెం డిపో కీలకమైనదని, దీన్ని తొలగిస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని కావున ముఖ్యమంత్రి , ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉన్న యం.పిలు, ప్రజా ప్రతినిధులు స్టీల్ మంత్రిని కలసి అయినా డిపోను కాపాడాలని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ నిరంతరం పిటిడి ఉద్యోగుల సమస్యలను అటు ప్రభుత్వం వద్ద, ఇటు ఆర్టీసీ అధికారులు వద్ద అందుబాటులో ఉండి పరిష్కరిస్తున్న ఏకైక యూనియన్ ఈరోజు ఎంప్లాయిస్ యూనియన్ మాత్రమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ.యు రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి వి.బాను మూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగు కార్యదర్శి నందమూరి రామారావు, జోనల్ అధ్యక్షులు కె.జె.శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, కోశాధికారి జి.తాతాలు, జోనల్ నాయకులు యు.యస్.నారాయణ, వై.రాము, రీజన్ నాయకులు కె.యం.యస్.ఏ.స్వామి, డిపో కోశాధికారి కె.సత్తిబాబు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను రోడ్డున పడేయొద్దు

మిథిలాపురి ఉడా కాలనీలో తొలగింపులపై నిరసనలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: రోడ్లపై జీవిస్తున్న చిరు వ్యాపారులపై టౌన్ ప్లానింగ్ అధికారుల చర్యలకు నిరసనగా మధురవాడ జోన్‌లో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మిదిలాపురి ఉడాకాలనీ రహదారిలో తోపుడుబండ్ల వర్తకులు రోడ్డుపై బైటాయించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. మధురవాడ సీపీఎం కార్యదర్శి రాజకుమార్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తోపుడుబండ్ల వర్తకులు రోడ్డుపై ధర్నా చేపట్టి శాంతియుతంగా వాహనాలను అడ్డుకున్నారు. ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయి, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వ్యాపారులు తమ జీవనాధారం కాపాడాలని కోరుతూ అధికారులను వీధి వ్యాపారులు కోరారు. రోడ్ మూసివేత కారణంగా అత్యవసర సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేయడానికి చర్యలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కొందరు ప్రజలు వ్యాపారుల జీవితాల్లో ఉపాధి సంక్షోభంపై ఆందోళనకు మద్దతు ప్రకటించి, ప్రభుత్వం స్పందించాలన్నారు. బడ్డీ తీసేందుకు వచ్చిన జేసీబీపైకి ఎక్కి అడ్డం పడ్డారు. అయినా కనికరం లేకుండా బడ్డీలు పూర్తిగా నేల మట్టం చేశారని కన్నీరు మున్నీరయ్యారు.

జాతీయ స్థాయిలో గీతం ఎన్‌సిసి కేడెట్‌ల ప్రతిభ

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎన్.సి.సి కేడెట్‌లు జాతీయ స్థాయిలో భారత నౌకాదళం నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభను చాటారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఇసిఇ తృతీయ సంవత్సరం విద్యార్థి చెల్లా శివశంఖర్, జాతీయ స్థాయిలో లోనావాలా లో ఇటీవల జరిగిన నౌ సైనిక్ శిబిరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరక్టరేట్‌లకు ప్రాతినిధ్యం వహించారు. జాతీయ స్థాయిలో 17 ఎన్‌సిసి డైరక్టరేట్‌ల నుంచి హాజరైన ఎన్‌సిసి కేడెట్‌లతో పోటీ పడి బోట్ పుల్లింగ్, సీమాఫోర్, డ్రిల్, సర్వీస్ విభాగాలలో విజేతగా నిలిచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచాడు. అలాగే ఒరిస్సాలోని భారత నౌకాదళ స్థావరం ఐఎన్ఎస్ చిల్కలో జరిగిన అఖిలభారత యాటింగ్ రెగెట్టా పోటీలలో గీతం ఎన్‌సిసి కేడెట్‌లను ప్రతిభను చాటారు. ఈ పోటీలలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ బిసిఏ తృతీయ సంవత్సరం విద్యార్థిని విశాఖ సింగ్ ప్రథమ స్థానాన్ని, సిఎస్ఇ తృతీయ సంవత్సరం విద్యార్థి అడబాల దీపక్ ద్వితీయ స్థానం సాధించారు. కాగా గీతం విద్యార్థుల ప్రతిభను గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఎన్.సి.సి అధికారులు అభినందించారు.

20న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - ఆనందపురం: ఈనెల 21న మహాకవి గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలను నిర్వహించనున్నట్టు ఆనందపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.త్రినాథరావు, బి.ముత్యాలనాయుడు తెలిపారు. వ్యాస రచన, దేశమును ప్రేమించుమన్న పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈనెల 20వ తేదీన నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని, వివరాలకు 7893963129, 9182467217ను సంప్రదించాలన్నారు.

అనంత పద్మనాభ స్వామి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో కొలువైయున్న శ్రీ అనంత పద్మనాభ స్వామి వారి ఆలయంలో హుండీ లెక్కింపు గురువారం నిర్వహించినట్లు ఈవో నానాజీ తెలియజేశారు. ఈ లెక్కింపు కుంతీ మాధవ స్వామి ఆలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కమిటీ సభ్యులు, భక్తుల సమక్షంలో జరిగినట్లు తెలియజేశారు. సుమారు 2,43,988 రూపాయలు ఆదాయం స్వామి వారికి వచ్చినట్లు తెలియజేశారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో పలువురు నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, భక్తుల పాల్గొన్నారు.

ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం వార్షిక స్పోర్ట్స్ బోర్డు సమావేశం ఏయూ పరిపాలనా విభాగం ఎగ్జికూటివ్ సమావేశ మందిరంలో బుధవారం జరిగింది. ఈసమావేశానికి స్పోర్ట్స్ బోర్డు చైర్మన్, ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గతేడాది పతకాలు సాధించిన ఏయూ క్రీడాకారుల ప్రతిభను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు నిర్వహించే విధంగా సింథటిక్ క్రీడా మైదానం, ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించే విధంగా ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్‌కు తెలిపారు. ఇతర యూనివర్శిటి క్రీడలకు వెళ్లే క్రీడాకారుల డి.ఎ పెంపు విషయంలో ఆలోచన చేస్తామన్నారు. శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని యూనివర్శిటీలో అనుబంధ కళాశాలల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, ఖోఖోక్రీడలు నిర్వహించనున్నామని తెలిపారు. ఏయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య ఎన్. విజయమోహన్ గత ఏడాది ఏయూ క్రీడాకారులు సాధించిన పతకాలు గురించి వివరించారు.

చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారుల ప్రతాపం సరికాదు

ఉపాధి పోగొట్టే చర్యలు అన్యాయం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అక్కయ్యపాలెం నరసింహ నగర్ రోడ్‌లో 2014 వీధి విక్రయిదారుల చట్టాన్ని వెంటనే అమలు చేసి హాకర్ జోన్స్ నిర్మించాలని ప్రభుత్వాన్ని విశాఖ ఫుట్ పాత్ అండ్ తోపుడుబల్ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.ప్రకాష్, జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా కోట్ల రూపాయలు దోపిడీకి పాల్పడుతూ భవంతులను నిర్మించుకుంటున్న బడా బాబుల జోలికి పోలేని జీవీఎంసీ అధికారులు పేద చిల్లర వర్తకులు, తోపుడు కార్మికులపై తమ ఉగ్ర రూపం చూపడం దుర్మార్గమన్నారు. జీవీఎంసీ అధికారులు జెసిబి తెచ్చి నరసింహ నగర్ రోడ్‌లో గత 20 సంవత్సరాలకు పైగా తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న పేద చిల్లర బడ్డీలను తొలగించి దౌర్జన్యం చేయడం తగదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద మధ్యతరగతి ప్రజలపై అన్ని ధరలు భారీగా పెంచి ఆహార భద్రత కొరత పెడుతూ చిరు వ్యాపారులపై పడటం దుర్మార్గం అన్నారు. పేద వర్గాలకు బతికే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సాయికుమార్, జై శ్రీనివాస్, నీలకంఠం, సూర్యారావు పాల్గొన్నారు.

సాంకేతికత ఆధారంగా కొత్త ప్రాజెక్టుల రూపకల్పన

విశాలాంధ్ర- సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ పరిధిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏ.టి.ఎల్)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. ముఖ్యంగా యాక్టివిటీస్, ప్రాజెక్ట్‌లను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా గురువారం వేపగుంట అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో జిల్లాలోని 9 ప్రభుత్వ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ప్రిన్సిపాల్స్‌కు, ఇన్‌చార్జ్‌లతో మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో సాంకేతికత ఆధారంగా కొత్త ప్రాజెక్టుల రూపకల్పన, అలాగే భవిష్యత్తులో ఏ.టి.ఎల్ ద్వారా చేపట్టవలసిన వినూత్న కార్యక్రమాలపై చర్చ జరిగింది. సుదర్శన్ మాట్లాడుతూ ఏ.టి.ఎల్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ దృక్పథం పెరుగుతోందన్నారు. డి.ఎస్.ఓ రాజారావు ప్రతీ పాఠశాల నుండి ఒక ఇన్నోవేటివ్ ప్రాజెక్ట్ చేసి విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించాలన్నారు. సమావేశంలో రమేష్, విశాఖ సోషల్ వెల్ఫేర్ స్కూల్ డి.సి.ఓ రామకృష్ణ, విశాఖ డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ రాజారావు, రాంబాబు పాల్గొన్నారు.

జోన్ 2లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు

విశాలాంధ్ర - పీఎం పాలెం: జీవీఎంసీ జోన్ -2లోని 8వ వార్డులో షిప్ యార్డ్ లే అవుట్‌లో అక్రమంగా మధురవాడ గ్రామం సర్వే నెంబర్లు 300/2, 301 రెండు కలిపి 67 సెంట్లు ప్రభుత్వ భూమి రాస్తాలో తప్పుడు పత్రాలతో దర్జాగా నిర్మాణం చేస్తున్న అంశంపై ఈ నెల 1 తేదీన విశాలాంధ్రలో 'ప్రభుత్వ భూమిలో దర్జాగా నిర్మాణం" శీర్షిక ప్రచురించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన జోన్ -2 పట్టణ ప్రణాళిక అధికారి ఎం.తిరుపతిరావు సర్వే నివేదిక ఇవ్వాలని జోన్ 2 జీవిఎంసి సర్వేయర్ ప్రభాకర్ రావును కోరారు. ఇంతలో సాధారణ బదిలీల్లో ఎసిపి తిరుపతిరావు బదిలీ కాగా జోన్ -2 ఏ సిపిగా షాబాన్ శాస్త్రి బాధ్యతలు స్వీకరించారు. సర్వేయర్ నివేదిక ఇచ్చి రోజులు గడుస్తున్నా అక్రమ నిర్మాణంపై చర్యలు చేపట్టకపోగా అధికారులు ఆక్రమణదారుడికి తమ వంతు సహకారాన్ని అందిస్తూ దండిగా దండుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో పక్క 54 సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ లక్ష్మణ్ నాయుడు ఆక్రమణదారుడితో చేతులు కలిపి భవన నిర్మాణ పనులు చేసుకునేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఈ ప్రభుత్వ భూమికి ముందుగా జీవిఎంసి రెవిన్యూ విభాగం అధికారులే వి ఎల్ టి స్థలం పన్ను విధింపుతో అసలు కథ మొదలైంది. ఏది ఏమైనప్పటికీ నిర్మాణం జరిగిన భవనాన్ని స్వాధీనం చేసుకొని ఆక్రమణదారుడుతోపాటు సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పోరాటం వల్ల కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి జనగన, కులగనన చేపడుతోందని, ఆయన సూచన మేరకు ఇప్పటికే తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులగనన విజయవంతంగా పూర్తి చేసి అసెంబ్లీలో బిసిలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర గవర్నర్‌కి వంపారని, బిసి రిజర్వేషన్‌పై కాంగ్రెస్ పార్టీ మాట నిలబెట్టుకుందని బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ తీర్మానం చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని కాంగ్రెస్ పార్టీ విశాఖ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి అన్నారు. బీసీల పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీ వెంటనే కులగనన చేసి బిసిలకు హక్కుగా రావాల్సిన రిజర్వేషన్ కల్పించాలని ఆమె డిమాండ్ చేసారు. బిసిలు అన్ని రంగాలలో బాగా వెనకబడి ఉన్నారని రిజర్వేషన్ కల్పించడం ద్వారానే వారికి న్యాయం జరుగుతుందన్నారు.

అంగీకార్ - 2025 బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 ప్రయోజనాలపై లబ్ధిదారులు అవగాహన కలిగి ఉండాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశం హాలు లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 ప్రచార అవగాహన బ్రోచర్లను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, యు.సి.డి ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ 2.0 పథకం ప్రారంభమై ఏడాది పూర్తి కావడంతో పీఎంఈవై ఆవాస్ దివాస్ ను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ నెల నుండి అక్టోబర్31 వరకు అంగీకార్ 2025 కార్యక్రమం జరుగుతుందని. పీఎంఏవై 2.0 పథకం వివరాలను లబ్ధి దారులకు తెలియజేయడం, పీఎంఏవై . 2.0 పథకంలో స్వంత స్థలం కలిగి ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు కేంద్రం 1.50 లక్షలు, రూ. రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష కలిపి రూ.2.50 లక్షలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్ ముస్తి మలియోగ ఉచిత విద్యుత్ పథకం, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే ఇతర పథకాలు లబ్ధిదారులకు అందుతాయన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ కె. సూరిబాబు, టిడ్కో పర్యవేక్షక ఇంజనీరు డి. నరసింహమూర్తి, టిడ్కో కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, హౌసింగ్ కార్పొరేషన్ కార్యనిర్వాహక ఇంజనీరు సుబ్రమణ్యం, జీవీఎంసీ యు సి డి సిబ్బంది, ఏ . హెచ్ .పి బి .ఎల్ .సి ,సి .ఎల్ .టి .సి లు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో 21 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ఉద్యోగులు తమ బాధ్యతలను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన ఛాంబర్ లో జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్లు గా విధులు నిర్వహిస్తున్న 21 మందికి సీనియర్ అసిస్టెంట్లు గా పదోన్నతి ఉత్తరువులను అందించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్లు గా పదోన్నతి పొందిన వారు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా విధుల పట్ల అంకిత భావంతో పని చేయాలని, బాధ్యతను విస్మరించకుండా తెలియని విషయాలను అధికారుల నుండి సూచనలు సలహాలు తీసుకొని విధులు నిర్వహిస్తూ జీవీఎంసీకి మరింత పేరు ప్రతిష్టలు తేవాలని ఆదేశించారు. తదుపరి పదోన్నతి పొందిన ఉద్యోగులు సీనియర్ అసిస్టెంట్లు గా పదోన్నతి ఉత్తర్వులను అందించినందుకు నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు, కమిషనర్ కేతన్ గార్గ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవిఎంసి అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అప్పలనాయుడు, జీవీఎంసీ పర్యవేక్షకులు సన్యాసిరావు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఇస్తున్న సేవలను వినియోగించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో అనేకమంది ఆర్థికంగా పేదవారికి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎంపిడిఓ వి.జానకి మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు ఆనందపురం మండలంలో ఉన్న అన్ని సచివాలయాల్లోనూ వచ్చే నెల 2వ తేదీ వరకు ఈ ఆరోగ్య శిబిరాలు జరుగుతాయని ప్రజలంతా వినియోగించుకోవాలని తెలిపారు. క్యాన్సర్ లాంటి వ్యాధులపై ప్రజల్లో పూర్తి అవగాహన తీసుకురావాలని ఆమె వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని మహిళలంతా ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సబీనా భాను మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాల్లో మాతా శిశు సంరక్షణ సేవలు, టీబి, మలేరియా, మధుమేహం, రక్తపోటు, ఇతర అంటువ్యాధులు లకు వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలంతా వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కోరాడ రాజబాబు, లొడగల వెంకట రమణ, కోరాడ రాంబాబు, లోడకల వెంకట్రావు, నవీన్ జ్ఞానేశ్వర్, సామాజిక వైద్య అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ హృదయ్, డాక్టర్ హైమ, డాక్టర్ అరుణశ్రీ పాల్గొన్నారు.

అపోలో హాస్పిటల్స్ 42వ వార్షికోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అపోలో హాస్పిటల్స్ తమ 42వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంది. దాదాపు 200 మిలియన్లకు పైగా జీవితాలను స్పృశించటం తో పాటుగా , 185 దేశాలలో నమ్మకాన్ని సంపాదించిన అపోలో హాస్పిటల్స్, భారతదేశంలో 19000కు పైగా పిన్‌కోడ్‌లను చేరుకుంది.1983లో భారతదేశంలో మొట్టమొదటి కార్పొరేట్ ఆసుపత్రిని ప్రారంభించిన అపోలో, నాలుగు దశాబ్దాలలో 51 లక్షలకు పైగా శస్త్రచికిత్సలు, 27000 కు పైగా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేయడం ద్వారా ఆరోగ్య సంరక్షణ విప్లవానికి నాంది పలికింది. దేశంలో నైపుణ్యం కలిగిన ఆరోగ్య సంరక్షణ మానవ మూలధనాన్ని గణనీయంగా పెంచుతూ అపోలో 11 లక్షలకు పైగా నిపుణులకు శిక్షణ ఇచ్చింది. భారతదేశ ఆరోగ్య సంరక్షణ నాణ్యతపై నమ్మకాన్ని సృష్టించడం ద్వారా, భారతదేశాన్ని ఆరోగ్య సంరక్షణకు ప్రపంచ గమ్యస్థానంగా అపోలో మార్చింది. అంతకుముందు చికిత్సల కోసం ఇతర ప్రాంతాలకు రోగులు వెళ్లే ధోరణినీ మార్చింది. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి మాట్లాడుతూ "అపోలో 1983లో ప్రారంభమైనప్పుడు, అది కేవలం ఒక ఆసుపత్రి ప్రారంభం మాత్రమే కాదు, ఒక ఉద్యమంయొక్క పుట్టుక. నాలుగు దశాబ్దాలుగా, ఆ ఉద్యమం 200 మిలియన్ల జీవితాలను తాకిన శక్తిగా ఎదిగింది, 185 దేశాలలో విశ్వాసాన్ని పెంపొందించుకుంది, ఆరోగ్య సంరక్షణలో సాధ్యమయ్యే వాటిని పునర్నిర్వచించింది. ప్రపంచ స్థాయి సంరక్షణను అందుబాటులోకి తీసుకురావడంతో పాటుగా భవిష్యత్తుకు సిద్ధంగా వాటిని ఉంచడం మా లక్ష్యం. ప్రపంచ వేదికపై భారతదేశం ఎదుగుతున్నవేళ, అపోలో ఒక చోదక శక్తిగా నిలుస్తుంది, ఆరోగ్యకరమైన సమాజాలను రూపొందిస్తుంది, వైద్య సరిహద్దులను అధిగమిస్తుంది, ప్రతిచోటా కుటుంబాలు ఆశ, ఆరోగ్యం , ఆనందంతో భవిష్యత్తును చూడగలవని నిర్ధారిస్తుంది "అని అన్నారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీత రెడ్డి మాట్లాడుతూ "ఒక దేశం యొక్క బలం దాని ప్రజల ఆరోగ్యంలో దాగి ఉంది.పురోగతికి నిశ్శబ్ద రూపశిల్పులు, భారతదేశ వైద్యులు, నర్సులు , సంరక్షకులు. అపోలో వద్ద , మేము ఆసుపత్రులను మాత్రమే కాకుండా, మానవ వనరులను తీర్చిదిద్దామన్నారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునీత రెడ్డి మాట్లాడుతూ, "రోగి కీలకంగా మా వృద్ధి ఎల్లప్పుడూ ఉద్దేశపూర్వకంగా ఉంటుందన్నారు.

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2025 సందర్భంగా మోటరోలా స్మార్ట్‌ఫోన్‌ల ఆఫర్లు

విశాలాంధ్ర - విశాఖపట్నం: మొబైల్ టెక్నాలజీలో ప్రపంచ అగ్రగామి, భారతదేశంలోని ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, ఈరోజు ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్ 2025 కోసం ఇంతకు ముందు ఎన్నడూ లే ని ధరలకు ప్రీమియం మరియు మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్ల అతిపెద్ద పండుగ శ్రేణిని ప్రకటించింది. ప్రపంచంలోనే అ త్యంత లీనమయ్యే ఏఐ ఆధారిత మోటోరోలా ఎడ్జ్ 60 ప్రో, మరియు మోటోరోలా ఎడ్జ్ 60 ఫ్యూజన్ మొదలుకొని బెస్ట్ సెల్లింగ్ మోటో జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్లు, ఐకానిక్ మోటోరోలా రాజర్ 60 సిరీస్ వరకు, మోటరోలా ఈ సీజన్‌లో పం దుగ షాపింగ్‌ను పునర్నిర్వచించనుంది. ఈ సేల్ సెప్టెంబర్ 23 వ తేదీ రాత్రి 12 గంటలకు ఎర్లీ యాక్సెస్ కస్టమర్లకు మ రియు ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌లో సెప్టెంబర్ 22 నుండి అందరు వినియోగదారులకు లైవ్ లోకి వస్తుంది. అన్ని ఉప కరణాలు సేల్ వ్యవధి అంతటా ఆకర్షణీయమైన బిగ్ బిలియన్ డేస్ ధరలకు అందుబాటులో ఉంటాయి. మోటరోలా ఎడ్జ్ 60 ప్రో ఈ బిగ్ బిలియన్ డేస్‌లో అల్టిమేట్ ప్రీమియం ఏఐ స్మార్ట్‌ఫోన్ డీల్‌తో ప్రారంభించి అందుబాటులో ఉంది.

మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: చాలా మంది మహిళలకు ఆహారం మరియు వ్యాయామం, సాధారణ పాప్ పరీక్షలు, మామోగ్రామ్‌లు మరియు ఫిజికల్ పరీక్షలు, మంచి ఆరోగ్యానికి ముఖ్యమైనవని అధ్యయనాలు చెబుతున్నాయని వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని లయన్స్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వర రావు తెలిపారు. వారు నిరంతర గొంతు నొప్పి లేదా అలసట వంటి లక్షణాలను అనుభవించినప్పుడు, అవి తీవ్రమైన ఆరోగ్య సమస్యకు హెచ్చరిక సంకేతాలు అయినప్పుడు వాటిని సాధారణ జలుబు లేదా వైరస్ యొక్క లక్షణాలుగా తోసిపుచ్చుతారని ఇది ప్రమాదకరమన్నారు. ముఖం లేదా అవయవాలలో అకస్మాత్తుగా బలహీనత రావడం స్ట్రోక్‌ను సూచిస్తుందని, అదనపు లక్షణాలు ఆకస్మిక గందరగోళం, అస్పష్టమైన మాటలు, అస్పష్టమైన దృష్టి, నడవడంలో ఇబ్బంది అనే లక్షణాలు ప్రమాదంకి సూచన అన్నారు. తరచుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దృష్టి సమస్యలు, ఛాతీ నొప్పి, గురక, అధిక మగత, అసాధారణ రొమ్ము గడ్డలు, అధిక ఒత్తిడి మరియు ఆందోళన, ఆకస్మిక బరువు మార్పు, ఋతుస్రావంలో మార్పులు, చర్మంలో మార్పులు, అధిక అలసట తదితర సరిగ్గా అనిపించని లక్షణాలను అనుభవిస్తే వైద్యుడిని సంప్రదించాలని చెప్పారు. వైద్య సహాయం తీసుకోవడం మరియు అర్హత కలిగిన వైద్యుడి నుండి సరైన చికిత్స సలహా పొందడం చాలా ముఖ్యం అని సూచించారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఆనందపురం: స్వచ్చత హి సేవ కార్యక్రమంలో భాగంగా పోస్టల్ డిపార్ట్మెంట్ నార్త్ సబ్ డివిజన్ అధికారి జి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో గొట్టిపల్లి బ్రాంచ్ ఆఫీస్ సౌజన్యంతో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నుక్కడ్ నాటక్ అను కార్యక్రమం జరిపి గ్రామ ప్రజలు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెడ్డిపల్లి సబ్ ఆఫీస్ పరిధిలో గల పోస్టల్ సిబ్బందితో గ్రామాల్లో అన్ని వీధుల్లో పరిశుభ్రతపై నినాదాలు అందించి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ అధికారి జగదీశ్వరరావు గ్రామస్తులకు, విద్యార్థులకు పోస్టల్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిపిఎం నూర్జహాన్, ఏబిపియం డబ్బీరు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కోరాడ వెంకట నరసింహనాయుడు (వెంకట్రావు), ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వి.శ్రీనివాసరావు, విలేజ్ పోలీస్ రామలక్ష్మి, శ్రీ సత్య సాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, కో- కన్వీనర్ డిపి రాజు, రెడ్డిపల్లి సబ్ ఆఫీస్ పరిధిలో గల బీపీఎంలు, ఏబిపిఎంలు పాల్గొన్నారు.

క్రైట్స్ స్కిల్స్ విద్యాసంస్థలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - పెందుర్తి: భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో సేవ వారోత్సవాలను పురస్కరించుకొని పెందుర్తి క్రైట్స్ స్కిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నందు మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పెందుర్తి పిహెచ్సి నుంచి డాక్టర్స్ హాజరైనారు ఈ మెడికల్ క్యాంపు స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగులు యువకులకు ప్రజలకు ఆరోగ్య పరిస్థితుల్ని సమీక్షించి బి పి, షుగర్ ఇతర వ్యాధుల్ని ఆరోగ్యపరీక్షల్ని

చేసి వారికి కావలసిన మందుల్ని ఉచితంగా ఇచ్చారు. పెందుర్తి పిహెచ్సి సూపరిండెంట్ రామకృష్ణ దొర, రవికిరణ్ సూర్య అనిరుద్ తదితర డాక్టర్స్ హాజరైనారు. అనకాపల్లి జిల్లా ఓబీసీ అధ్యక్షులు కంచిపాటి వెంకట సన్యాసిరావు హాజరైనారు ఈ యొక్క కార్యక్రమంలో పలువురు నాయకులు క్రైట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘం మాజీ ఎండి ఎస్‌విఎస్ఎన్ రాజు మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ మధుర కురపల్లి గ్రామానికి చెందిన సాగి వెంకట సూర్య నారాయణ రాజు (చిట్టి బాబు)(93) గురువారం తుది శ్వాస విడిచారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సహకార సంఘం ఎండిగా సేవలు అందించారు. బంధువులు, స్థానిక గ్రామస్తులు, పలువురు ఆయన భౌతిక దేహాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఎస్ వి ఎస్ ఎన్ రాజు వ్యవసాయ సహకార సంఘం ఎండిగా ఎనలేని సేవలు అందించారని ఆయన లేని లోటు తీర్చలేమని పలువురు అన్నారు.

నేటి నుంచి దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర దస్తావేజులేఖర్లు సంఘం పిలుపుమేరకు ఈనెల 19, 20 తేదీలలో మండలంలో గల దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ చేసి నిరసన తెలియజేయునన్నట్లు మండల దస్తావేజు లేఖర్ల సంఘం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వలన అనగా ఆధార్ ఓటిపి,స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డు ప్రైమ్మీ సాఫ్ట్వేర్ లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజు తయారీ అనేది జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతున్నందున అటు ప్రజలు, ఇటు దస్తావేజు లేఖరులు చాలా విలువైన సమయాన్ని వృధా చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి అని పేర్కొన్నారు. ఈ విధానాలలో మార్పు అవసరమని ప్రభుత్వానికి నివేదిస్తూ ఈనెల 19 ,20 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ చేసి నిరసన తెలియజేయదలచినారని ఇందులో భాగంగా ఆనందపురం మండలంలో కూడా రెండు రోజులు దస్తావేజులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏలాంటి సేవలు అందించబడవని దీనికి ప్రజల సహకరించాలని మండల దస్తావేజు లేఖరుల సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

సామ్సంగ్ గెలాక్సీ ఏ 065జీ పై రాయితీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: సామ్సంగ్ ఈరోజు పండుగ సీజన్‌కు ముందు గెలాక్సీ ఏ06 5 జీ స్మార్ట్‌ఫోన్‌పై మునుపెన్నడూ చూడని ధరను ప్రకటించింది. ఈరోజు నుండి, పరిమిత-కాల ఆఫర్‌లో భాగంగా గెలాక్సీ ఏ 06 5 జీ కేవలం రూ. 9899కే అందుబాటులో ఉంటుంది. ఫీచర్ ఫోన్ లేదా 4 జీ స్మార్ట్‌ఫోన్ నుండి గెలాక్సీ ఏ06 5 జీ కి అప్‌గ్రేడ్ కావాలనుకునే వినియోగదారులకు ఈ డీల్ సరైన అవకాశాన్ని అందిస్తుంది, ఇది సరసమైన ధరలో పూర్తి 5 జీ అనుభవాన్ని అందిస్తుంది. అదనంగా, పండుగ డీల్‌లో భాగంగా, గెలాక్సీ ఏ06 5 జీ కొనుగోలు చేసే వినియోగదారులు రూ. 1399 విలువైన సామ్సంగ్ 25 డబ్ల్యూ ట్రావెల్ అడాప్టర్‌ను కేవలం రూ. 299కే పొందుతారు. మరింత సరసమైన ధరను కోరుకునే వినియోగదారులు నెలకు కేవలం రూ. 909 చెల్లించి స్మార్ట్‌ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు. గెలాక్సీ ఏ06 5 జీపై ఈ పండుగ డీల్, డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి మరియు లక్షలాది మంది వినియోగదారులకు పూర్తి 5 జీ అనుభవంతో సాధికారత కల్పించడానికి సామ్సంగ్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అత్యంత సరసమైన గెలాక్సీ ఏ సిరీస్ 5 జీ స్మార్ట్‌ఫోన్‌గా, గెలాక్సీ ఏ06 5 జీ దాని విశ్వసనీయ పనితీరు మరియు దీర్ఘకాల మన్నికతో వినియోగదారులకు గరిష్ట విలువను అందించడానికి రూపొందించబడింది.

సినీ పరిశ్రమ ఆంధ్రకు తరలిరావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: హైదరాబాద్ కే పరిమితం అవుతున్న తెలుగు సినీ పరిశ్రమ ఆంధ్రప్రదేశ్ కు తరలిరావాలని మిషన్ కర్షకదేవోభవ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆదారి కిషోర్ కుమార్ కోరారు. కె.ఎల్ యూనివర్సిటీలో వీబీ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన 5వ వెండితెర అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కళాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువగా కళాకారులు ఉన్నా, సరైన అవకాశాలు లేక జీవనం కూడా సాగించలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా షూటింగులకు అనువైన ప్రదేశాలు ఆంధ్రాలో ఉన్నప్పటికీ పెద్ద స్థాయిలో సినిమా నిర్మాణాలు జరగడం లేదని తెలిపారు. ఆంధ్రలో కూడా సినిమా చిత్రీకరించి ఇక్కడ కళాకారులకు ఊతమివ్వాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం సమాకూరుతుందని చెప్పారు. ప్రభుత్వ పరంగా కూడా చిన్న కళాకారులకు అవార్డులు ప్రధానం చేసే కార్యక్రమాలు చేపడితే ప్రోత్సాహకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీనియర్ దర్శకుడు కె. విశ్వనాథ్‌కు జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. వీబీ ఎంటర్టైన్మెంట్స్ వ్యవస్థాపకుడు విష్ణు బొప్పన ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సినీ రంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నటులు సాయికుమార్, ఆలీ, పృథ్వీరాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - తగరపువలస: విశాఖపట్నం జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరు, ఆపరేషన్ సర్కిల్, విశాఖపట్నం వారి సూచనల మేరకు ప్రతిపాది ంపబడిన లైన్ మెయింటెనెన్స్ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కెవి భీమిలి సబ్ స్టేషన్ మెయిం టెనెన్స్ పనులు, ట్రీ కటింగ్ నిమిత్తం కరెంట్ సప్లయ్ నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. భీమిలి, నేరెళ్లవలస, జ్.వి. అగ్రహారం, కొత్తవలస, నిదిగట్టు, కుమ్మరిపాలెం, స్మిత్ ట్రీట్, అప్పికొండ వీధి, బ్యాంక్ కాలనీ, ములకుదు, మామిడిపాలెం, రేఖవనిపాలెం, రాయపాలెం, మహాలక్ష్మీపురం, పాలిటెక్నిక్ కాలేజీ, జగనన్న కాలనీ, తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలుపుదల చేయబడుతుందన్నారు.

బాల్యం విద్యా పథకాన్ని మరింత పటిష్టపరచండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బాల్యం కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ బాల్యం ప్రాజెక్ట్ ఆఫీసర్ ను ఆదేశించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో సెప్టెంబర్ 7, 2025 తేదీన జాతీయస్థాయిలో లైవ్ కాంపిటేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జీవీఎంసీ బాల్యం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బాల్యం విద్యార్థులకు మంచి వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. దేశంలో 20 రాష్ట్రాలకు సంబంధించి 150 జిల్లాల నుండి 250 మంది 3 నుండి 5 సంవత్సరాలలోపు విద్యార్థిని విద్యార్థులు ఈ జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్నారని కమిషనర్ తెలిపారు. సెప్టెంబర్ 7, 2025న జాతీయస్థాయిలో లైవ్ కాంపిటీషన్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మల్కాపురం , చెంగాల రావు పేట బాల్యం కేంద్రాలలోని 4 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు కారే హరి లిశిక, డోమానా గ్రీష్మ లు ఆంగ్ల పద్యాల కేటగిరిలో విజేతలగా నిలిచారని, ఆర్. పి. పేట, ప్రగతి నగర్ బాల్యం కేంద్రాలలోని 4 సంవత్సరాల వయసు గల చిటికెల హాన్విక, పిల్లి ప్రణతి లు ఫాన్సీ డ్రెస్ కేటగిరీలో విజేతలగా నిలిచారని, వీరిని ఢిల్లీలోని లి"చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్‌లి"నిర్వాహకులు మెడల్స్, షీల్డ్స్, ప్రతిభ ధ్రువీకరణ పత్రాలు అందించారని కమీషనర్ విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తూ ఆయా బాల్యం కేంద్రాల అధ్యాపకులను కమిషనర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో బాల్యం కేంద్రాల లోని విద్యార్థినీ విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగాను, భావి పౌరులుగా తీర్చిదిద్దాలని కమిషనర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, బాల్యం ప్రాజెక్టు ఆఫీసర్ హెచ్. శంకర్రావు, బాల్యం ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ తోపాటు బాల్యం కేంద్రాల అధ్యాపకులు ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.